క్లుప్తంగా

మొదటి రోజే విద్యాకానుక కిట్ల పంపిణీ

కలువాయి: పాఠశాలలు తెరిచిన మొదటి రోజే పిల్లలకు విద్యాకానుక కిట్లు పంపిణీ చేయాలని ఆత్మకూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి గోపాల్ ఆదేశించారు. ఆయన గురువారం కలువాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. పుస్తకాలను ముందగానే పాఠశాలలకు తరలించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడారు. పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టాలన్నారు. వంట సమయంలో శుభ్రతను పాటించాలని, పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో విద్యాధికారులు బాలకృష్ణయ్య, శేషగిరిరావు, సీఆర్ఎంటీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలి

వెంకటగిరి రూరల్ : పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఏంఈఓలు వెంకటేశ్వర్లు, బాబయ్య తెలిపారు. వారు గురువారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో గురువారం మధ్యాహ్న భోజన నిర్వాహకులతో సమీక్షించారు. వారు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల వివరాలు తెలుసుకుని భోజనం తయారుచేయాలన్నారు. మెనూను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రిసోర్స్‌పర్సన్ ఎస్.రోజా, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

1న హనుమాన్ జయంతి వేడుకలు

రాపూరు: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో 1వ తేదీన హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు రామనాథేశ్వరశర్మ తెలిపారు. ఉదయం 5 గంటలకు పంచామృతాభిషేకం, 12 గంటలకు తమలపాకులతో ప్రత్యేక పూజలు, రాత్రి 8 గంటలకు సింధూరంతో అభిషేకం చేస్తామన్నారు.

దుకాణాల తనిఖీ



రైతు బజార్‌లో తూకాలను పరిశీలిస్తున్న మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్

గూడూరు రూరల్ : కొలతలు, తూకం కచ్చితంగా ఉండేలా వ్యాపారులు చూసుకోవాలని, వినియోగదారుడు నష్టపోయినట్లు భావించి ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తామని తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్ తెలిపారు. ఆయన గురువారం పట్టణంలోని రైతు బజార్‌తో పాటు పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లలో ఏవైనా లోపాలు ఉన్నాయా అని పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఏడాదికొకసారి తూనికల రాళ్లు, త్రాసులను కార్యాలయంలో చూపించి ధ్రువీకరణ పత్రాలు పొందాలన్నారు. తూనికలు, కొలతల్లో అనుమానం వస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. రైతు బజార్ ఎస్టేట్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



బాధితులకు సహాయం అందిస్తున్న తహసీల్దార్ లక్ష్మీదేవి

చిల్లకూరు : మండలంలోని తిప్పగుంటపాళెంలో బుధవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో గాయం నాగరాజు అనే వ్యక్తి పూరి గుడిసె కాలిపోయింది. అతను తన స్థలంలో పక్కా ఇంటి నిర్మాణ పనులు చేపట్టాడు. పక్కనే పూరింటిలో కాపురం ఉన్నాడు. బుధవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో పూరింటికి మంటలు అంటుకున్నాయి. చుట్టు పక్కల వారు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు చుట్టుపక్కల ఇళ్లకు వ్యాప్తించకుండా అదుపు చేశారు. ప్రమాదంలో ఉన్న రూ.1.50 లక్షల నగదు, సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. వారిని గురువారం తహసీల్దార్ లక్ష్మీదేవి, ఆర్ఐ రమ్యస్వాతి, వీఆర్వో విద్యావతి పరామర్శించారు. 25 కేజీల బియ్యం, రూ.5 వేల నగదు, నిత్యావసర వస్తువులు అందజేశారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

గూడూరు రూరల్ : కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ కృషి చేస్తుందని ఆ సంఘం నాయకుడు వెంకటరామిరెడ్డి తెలిపారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక సీపీఎం కార్యాలయం సమీపంలో జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కోల్‌కతాలోని కార్మిక సంఘాల మహాసభలో ఆవిర్భవించిన సీఐటీయూ నాటి నుంచి కార్మికుల భవిష్యత్తుకు పోరాటాలు చేస్తూనే ఉందన్నారు. కార్మికులను సంఘటితం చేయడంతో పాటు ఆయా పరిశ్రమల్లో ఏవైనా నష్టం జరిగినప్పుడు, కార్మికులకు ఇబ్బంది కలిగినప్పుడు సీఐటీయూ అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు జోగి శివకుమార్, పామంజి మణి, బీవీ రమణయ్య, యస్ సురేష్, అడపాల ప్రసాద్, జీ రవణయ్య, బీ చంద్రయ్య, బీ నారాయణ,సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పల్లె ముంగిటకు వైద్య సేవలు

- వైద్యానికి పెద్ద పీట వేసిన ప్రభుత్వం
- వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో 12 రకాల వైద్య పరీక్షలు



పొలం వద్ద గర్భిణికి వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది



ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి శ్రీహరి(ఫైల్)



చిన్న పిల్లలకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

చిల్లకూరు: సరైన పోషకాహారం లేక పేదలు అనారోగ్యం బారిన పడుతూ ఉంటారు. తమకు వచ్చే అరకొర ఆదాయంలో సగానికి పైగా వైద్యానికి ఖర్చు చేస్తుంటారు. దీంతో ఆర్థికంగా చితికిపోతారు. అలాంటి వారికి మెరుగైన వైద్యం ఇంటి ముంగిటే అందించాలని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా దీంతోనే 104 ద్వారా ఫ్యామిలీ డాక్టర్, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాలు నిర్వహించింది. అలాగే సచివాలయానికి అనుబంధంగా ఒక వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించింది. స్థానికంగానే 12 రకాల వైద్య సేవలు అందిస్తూ పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తోంది. నెలకు ఒక సారి 104 వాహనం ద్వారా ఎంపిక చేసిన గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సాధారణ రోగులతో పాటు గర్భిణులు, బాలింతలకు పరీక్షలు చేస్తున్నారు. అనంతరం ఆ గ్రామాల్లోనే ఇంటి వద్ద కదలలేని దీర్ఘకాలిక రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నారు.

గూడూరు డివిజన్‌లో రెండు నెలల్లో ఫ్యామిలీ డాక్టర్ ద్వారా పరీక్షలు చేయించుకున్న వారు

పరీక్షలు నిర్వహించిన రోగులు -	7927 మంది
గర్భిణులు -	311
బాలింతలు -	297
క్షయ వ్యాధిగ్రస్తులు -	22
క్యాన్సర్ రోగులు -	13
మంచానికే పరిమితమైన రోగులు -	32
షుగర్ వ్యాధిగ్రస్తులు -	4118
రక్తపోటు ఉన్న వారు -	3743
సాధారణ రోగులు -	1264 మంది

వేల రూపాయల ఖర్చు తగ్గింది



నాకు ప్రతి నెలా షుగర్ మందులకు రూ.వెయ్యి ఖర్చు అయ్యేది. నెలనెలా అప్పు చేయాల్సి వచ్చేది. పైగా ఆస్పత్రులకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉండేది. ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానం తీసుకువచ్చాక ప్రతి నెలా ఇంటి వద్దే పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు ఇస్తున్నారు. ఇప్పుడు అప్పు చేయకుండానే ఆరోగ్యం బాగుపడుతోంది.

– షేక్ ఫజురున్నీషా, ఏరూరు, చిల్లకూరు

ప్రతి నెలా బీపీ మందులు తీసుకుంటున్నా



నాకు కొన్ని సంవత్సరాలుగా బీపీ ఉంది. ప్రతి నెలా గూడూరుకు వెళ్లి పరీక్షలు చేయించుకుని మందులు కొనుకునేవాడిని. ఇప్పుడు డాక్టర్లు ఇంటి వద్దకే వచ్చి క్రమం తప్పకుండా పరీక్షలు చేస్తున్నారు. నాకు పరిస్థితిని వివరించి మందులు ఇస్తున్నారు. ప్రయాణ భారం తగ్గడంతో పాటు ఉచితంగా మందులు అందుతున్నాయి.

– కందల కొండయ్య, ఏరూరు, చిల్లకూరు

కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్నా



నేను నాలుగేళ్ల నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాను. నెల్లూరు, చెన్నై ప్రాంతాల్లోని ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటే మందులు వాడమన్నారు. అవి బయట తీసుకుంటే రూ.వేలు అవుతాయి. ఇప్పుడు 104 వైద్యుల వద్ద ఆ మందులు ఉచితంగా తీసుకుంటున్నా. దీంతో పింఛను సొమ్ము మిగులుతోంది.

– శంకరమ్మ, వడ్డికండ్రిగ, చిల్లకూరు

నాణ్యమైన వైద్యం అందిస్తున్నాం



వైద్యులపై పనిభారం పడినా పేదలు చూపించే ఆదరణ చూసి సంతోషంగా ఉంటోంది. మండలాల్లో పీహెచ్‌సీలు ఉన్నప్పటికీ సచివాలయానికి ఒక వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేశారు. అక్కడ ఖరీదైన మందులు ఉన్నాయి. అలాగే ఆన్‌లైన్‌లో వైద్య సలహాలు తీసుకుని వైద్యం అందించేలా శ్రీకారం చుట్టారు.

– డాక్టర్ అరాఫత్, చిల్లకూరు పీహెచ్‌సీ

అపరిచితుల సమాచారం ఇవ్వండి



టిడ్కో ఇళ్ల వద్ద స్థానికులతో మాట్లాడుతున్న సీఐ వేణుగోపాల్‌రెడ్డి

గూడూరు రూరల్ : అపరిచితులు, అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తులు ఎవరైనా వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని గూడూరు రూరల్ సీఐ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఆయన గురువారం తమ సిబ్బందితో కలిసి గూడూరు రూరల్ పరిధిలోని టిడ్కో ఇళ్లు, తదితర ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ చేపట్టారు. రికార్డులు లేని 25 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. రూరల్ పరిధిలోని జాతీయ రహదారిపై పోటుపాళెం సర్కిల్‌లో కేంద్ర బలగాలతో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎక్కడా శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు గూడూరు పట్టణం, రూరల్ ప్రాంతాల్లో ఎక్కడా సభలు, సమావేశాలు నిర్వహించడానికి అనుమతి లేదన్నారు. 144వ సెక్షన్ అమలులో ఉందన్నారు. కార్యక్రమంలో 1, 2 పట్టణాల సీఐలు పాపారావు, రవికిరణ్, ఎస్ఐలు మనోజ్‌కుమార్, సుధీర్‌కుమార్, శ్రీహరి బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతర ఆదాయం రూ.6.11 లక్షలు



హుండీల్లోని కానుకలను లెక్కిస్తున్న అధికారులు, నిర్వాహకులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ జాతరను విజయవంతం కావడంపై దేవదాయ శాఖ జిల్లా అధికారి రామకృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం దేవ దాయశాఖ అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో లెక్కించగా మొత్తం రూ.4,27,882 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేసిన రూ.100 టికెట్ల ద్వారా రూ.1,33,415, కానుల ద్వారా రూ.49,808 వచ్చిందన్నారు. మొత్తం రూ.6,11,090 ఆదాయం వచ్చిందని వివరించారు. గతఏడాది కంటే ఈ సారి అధికంగా రూ.1.87 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. జాతర విధులకు హాజరైన సిబ్బందికి, స్థానికులకు అమ్మవారి ప్రసాదాలు అందజేసి అభినందించారు. గూడూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, స్థానిక ఆలయాల ఈవో శశాంక్, గ్రామ పెద్దలు ఆకుల కుబేరుమణి, నల్లబోతుల రామారావు, పోలేరమ్మ ఆలయ మాజీ చైర్మన్ గంధవల్లి సిద్దయ్య, ఆలయ అర్చకులు రాయపూరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నదానం

జాతరలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం గడియారం సెంటర్ వద్ద ఉన్న పోలేరమ్మ ఆలయ ఆవరణలో అన్నదానం చేయనున్నట్లు ఈఓ శశాంక్ తెలిపారు. పారిశ్రామికవేత్త పెనల జయప్రకాష్ శెట్టి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.

కమనీయం.. శ్రీనివాస కల్యాణం

వాకాడు : మండలంలోని గంగన్నపాళెం దళితవాడలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారామ ధార్మిక సేవా సంస్థ సౌజన్యంతో స్వామి వారి శాంతి కల్యాణం చేశారు. ఉభయకర్తలుగా వంజివాక రమణయ్య, రాధిక, సుబ్రమణ్యం, సామ్రాజ్యం దంపతులు వ్యవహరించారు.

స్వామివార్లకు పుష్పయాగం చేస్తున్న వేద పండితులు, పుష్పయాగానికి తీసుకొచ్చిన పుష్పాలు





వైభవంగా పుష్పయాగం



నాయుడుపేట టౌన్ : తుమ్మూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు గురువారం రాత్రి పుష్పయాగాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. పుష్పయాగం కోసం తీసుకొచ్చిన పూల బుట్టలతో టీటీడీ డిప్యూటీ ఈవో సురేంద్రబాబు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరిరెడ్డి గ్రామ పెద్దలతో కలిసి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పుష్పయాగం చేశారు. ఉదయం ఆలయంలో అభిషేక పూజలు, సుప్రభాత సేవ, ఆరాధన. సహస్రనా మార్చన, బలిహరణం, మధ్యాహ్నం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, రాత్రి ఊంజల్ సేవ, ఏకాంత సేవ చేశారు. ప్రధాన అర్చకులు శేషాద్రస్వామి, ఆలయ మాజీ ట్రస్టీ కామిరెడ్డి రామకృష్ణారెడ్డి, కామిరెడ్డి మోహన్‌రెడ్డి, నరసారెడ్డి, పసల గంగాప్రసాద్, నల్లారెడ్డి శివకుమార్‌రెడ్డి, పోలూరు సుకుమార్, కామిరెడ్డి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు

ప్రతి గ్రామానికీ తాగునీరు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

వాకాడు : ప్రతి గ్రామానికీ తాగునీరు అందించాలని ఎంపీపీ కొడవలూరు అనసూయమ్మ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై అధికారులను నిలదీశారు. అనంతరం శాఖల వారీగా అధికారులు మండలంలో జరిగిన అభివృద్ధి పనులపై వివరణ ఇచ్చారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏఎంసీ చైర్మన్ వాకాటి నాగభూషణమ్మ, వైస్ ఎంపీపీ వెంకటరమణయ్య, వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, దువ్వూరు భాస్కర్‌రెడ్డి, ఏనుగు సుధాకర్‌నాయుడు, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


పచ్చిరొట్ట విత్తనాలతో భూమి సారవంతం

చిల్లకూరు: రైతులు వ్యవసాయ పనులు మొదలు పెట్టే ముందు పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసేలా అవగాహన కల్పించాలని ఏవో భవాని తెలిపారు. ఆమె గురువారం ఆర్బీకేల వ్యవసాయ సహాయకులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ అయిన తరువాత పీఎం కిసాన్ యోజన నగదు రైతుల ఖాతాల్లో జమ అవుందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నానో యూరియాను పరిచయం చేసేందుకు సిద్ధం అవుతోందని, ప్రతి రైతూ దాన్ని వాడేలా చూడాలన్నారు. రైతు భరోసా అందుకునే రైతుల ఆధార్‌ను అప్ గ్రేడ్ చేయాలని సూచించారు. రైతులకు సరిపడా పచ్చిరొట్ట, జీలుగ, జనుము, పిల్లిపెసర లాంటి విత్తనాలు అందించేందుకు వీలుంటుందని తెలిపారు.

జూన్ 27న చిన్నదర్గా ఉరుసు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని చిన్నదర్గా (హజరత్ ఖాదర్‌షావలీ) ఉరుసు (గంధోత్సవం)ను జూన్ 27 తేదీన నిర్వహించనున్నట్టు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. ఆయన గురువారం రాత్రి దర్గా వద్ద గంధోత్సవానికి సంబంధించిన నిషాన్ జెండాను ఎగురవేశారు. ముందుగా దర్గాలో నిషాన్ జెండాతో ఫాతేహాలు జరిపారు. 27 తేదీ నుంచి గంధోత్సవం రెండు రోజుల పాటు జరపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దర్గా కమిటీకు చెందిన చాన్‌బాషా, శేఖర్, సీలిశెట్టి మహేంద్ర, వంశీ, చంద్రశేఖర్, మురళీ, మస్తాన్, కువ్వాకుల శ్రీనివాసులు, పఠాన్ హర్షద్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



రామానాయుడు

దక్కిలి : మండలంలోని దగ్గవోల్జుకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కోలా రామానాయుడు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, మాధవయ్యపాళెం సొసైటీ అధ్యక్షుడు నర్రావుల వేణుగోపాల్ నాయుడు, మాధమాల నారాయణరెడ్డి అక్కడికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మృతుడు బీహర్ వాసిగా గుర్తింపు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని తుమ్మూరు మొక్కల నర్సరీ సమీపంలో మృతి చెందిన వ్యక్తి బీహర్‌కు చెందిన తేంద్రసింగ్‌గా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. అతను అయ్యప్పరెడ్డిపాళెం సమీపంలోని ఎంపీ చక్కెర పరిశ్రమ మరమ్మతు పనులు చేసేందుకు వచ్చినట్టు తేలింది. ఈ నెల 28న మద్యం సేవించి మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడు నిఖిల్‌కుమార్ అతన్ని గుర్తించినట్టు పేర్కొన్నారు. అతని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కండలేరులో 6.640 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు జలాశయంలో గురువారం నాటికి 6.640 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నే రువాగుకు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పోలేరమ్మను దర్శించుకున్న నేదురుమల్లి



ఎంపీపురంలో వైఎస్సార్‌సీపీ నాయకులుతో నేదురుమల్లిరామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు: మండలంలోని మునగాలవెంకటాపురంలో జరుగుతున్న పోలేరమ్మ జాతరలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనకు గ్రామ పెద్దలు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పోలేరమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాపకన్ను దయాకర్‌రెడ్డి, నాయకులు జగదీష్, విజయ్, మురళీమోహన్‌రెడ్డి, కామాక్షయ్య, కోటేశ్వరరెడ్డి, లీలామోహన్‌రెడ్డి, పాపయ్య, శ్రీనివాసులు, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



వెంకట రమణయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి మున్సిపాలిటీలోని 1వ వార్డు బంగారుపేట హరిజనవాడకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మేకల శ్రీనివాసులు సోదరుడు మేకల వెంకటరమణయ్య అనారోగ్యంతో బాధపడుతూ వారం రోజుల క్రితం మృతి చెందారు. గురువారం ఉత్తర క్రియలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బంగారుపేటలోని మేకల రమణయ్య ఇంటికి చేరుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటరమణయ్య తల్లిదండ్రులు మేకల పెద్ద వెంకటయ్య, సంపూర్ణమ్మ, సోదరులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, జేసీఎస్ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, 1, 2 వార్డుల కౌన్సిలర్లు పేర్నేటి సుబ్బారావు, తూపాటి చెంచయ్య, దొంత బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్‌రెడ్డి ఉత్తరక్రియలకు హాజరైన నేదురుమల్లి

దక్కిలి: దక్కిలికి చెందిన పెనుశిల లక్ష్మీనరసింహా స్వామి మాజీ ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్ చెలికం భాస్కర్‌రెడ్డి ఈ నెల 21వ తేదీన గుండె పాటుతో మృతి చెందారు. గురువారం ఉత్తర క్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు సుబ్బమ్మ, నరేష్‌రెడ్డిని పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పి.జగన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జీ సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, నాయకులు బి.భాస్కర్‌నాయుడు, డి.రవీంద్రారెడ్డి, ఎం. నారాయణరెడ్డి, కె.వేణుగోపాల్, వేణునాయుడు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడి



యాతలూరులో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నాగార్జున సాగర్

వెంకటగిరి రూరల్ : వేరుశనగ పంట సాగులో రైతులు సమగ్ర యాజమాన్యం పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ఏడీఏ నాగార్జునసాగర్ తెలిపారు. ఆయన గురువారం వెంకటగిరి రూరల్ మండలంలోని యాతలూరులో వేరుశనగ, వరి పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వెంకటగిరి సబ్ డివిజన్‌లోని వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లో సుమారు 1600 ఎకరాల్లో వేరుశనగ పంటను రైతులు సాగుచేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పంట పూత, ఊడ దశలో ఉందన్నారు. ఎకరాకు 200 కేజీల జిప్సం, 20 కేజీల జింక్ సల్ఫేట్, లీటరు నీటిలో ఒక గ్రాము చొప్పున బోరాన్ కలిపి పిచికారీ చేయాలన్నారు. దీంతో నాణ్యమైన దిగుబడులు వస్తాయన్నారు. వ్యవసాయ బోర్లలో తగినంత సాగునీరు లేక పోవడం కారణంతో వరి సాగుచేయని రైతులు ఈ ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేసుకోవాలని సూచించారు. జూన్ నెలాఖరు వరకు గడువు ఉందని, టీఏజీ–24, టీసీజీఎస్ 1694 రకాల వేరుశనగ విత్తనాలు వేసుకోవాలన్నారు. ఏఓ సుజాత, రైతులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ సంగమేశ్వరరావు, పోలీసు సిబ్బంది

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి పట్టణంలోని రాపూరు క్రాస్ రోడ్డు, పాత బస్టాండ్, వెంకటగిరి క్రాస్ రోడ్డుతోపాటు పలు ప్రాంతాల్లో వాహనాలను గురువారం వెంకటగిరి సీఐ సంగమేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. వాహనాల్లో అక్రమ రవాణాలకు పాల్పడే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. 4వ తేదీన జరుగు పోలింగ్ కౌంటింగ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు జిత్యనాయక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం సేల్స్‌మన్‌పై దాడి

వాకాడు : తూపిలిపాళెంలో గురువారం మద్యం దుకాణం సేల్స్‌మన్‌పై వ్యక్తి దాడి చేశాడు. తూపిలిపాళెం మద్యం దుకాణంలో సేల్స్‌మన్‌గా ఎంబేటి గౌతమ్ పని చేస్తున్నాడు. గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బాలాజీ షాపు వద్దకు వచ్చి ఒకేసారి 10 బాటిళ్ల మద్యం కావాలని అడిగాడు. నిబంధనలకు విరుద్ధంగా ఒక వ్యక్తికి 10 బాటిళ్లు ఇవ్వరాదని సేల్స్‌మన్ నిరాకరించాడు. దీంతో బాలాజీ అతనిపై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బాలాజీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

మోటార్ల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

కోట : విద్యానగర్, చెందోడు పరిసర ప్రాంతాల్లో మోటార్లను చోరీ చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ నాగబాబు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ విద్యానగర్‌కు చెందిన భారతీరెడ్డి తన ఇంటి వద్ద ఉంచిన 11 మోటార్లు చోరీకి గురైనట్టు ఫిర్యాదు చేశారని తెలిపారు. విచారణ చేయగా చిట్టేడుకు చెందిన గుణ మోటార్లను చోరీ చేసినట్టు తేలిందన్నారు. అతన్ని అరెస్టు చేసి మోటార్లను రికవరీ చేశామన్నారు. అతని వద్ద ఉన్న ఆటోను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.